# శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య 1964 వ సంవత్సరం జూలై 25 వ తేదీన శాసన పరిషత్తు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1968 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

వీరు 1885 వ సంవత్సరం డిసెంబరు 3 వ తేదీన శ్రీ వీరరాఘవయ్య, శ్రీమతి యశోదమ్మలకు కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామంలో జన్మించారు.

శ్రీ బ్రహ్మయ్య తన 16 వ ఏట నుండే రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నారు. 1932 సంవత్సరములో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని కారాగార శిక్షను అనుభవించారు. 1942 వ సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రాజమండ్రి, బరంపురం జైళ్ళలో సుమారు 6 సంవత్సరముల పాటు కఠిన కారాగార శిక్షను అనుభవించారు.

వీరికి డాక్టర్ పట్టాభి సీతారామయ్య, శ్రీ ముట్నూరు కృష్ణారావు, శ్రీ చెరుకువాడ నరసింహం పంతులు మొదలైన వారితో సన్నిహిత సాంగత్యం ఉండేది. ఆచార్య రంగా సహచరునిగా రైతులోకానికి ఎనలేని సేవను చేసారు. ఆంధ్ర రైతు సంఘం అధ్యక్షులుగా పనిచేసారు.

శ్రీ బ్రహ్మయ్య 1958 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1964 సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు, 1968 వ సంవత్సరం జూలై 1 నుండి 1974 వ సంవత్సరం జూన్ 30 వరకు శాసనసభ నియోజకవర్గం నుండి శాసన పరిషత్తు సభ్యులుగా వున్నారు. వీరు 1958 వ సంవత్సరం జూలై 7వ తేదీన శాసన పరిషత్తుకు తాత్కాలిక అధ్యక్షులుగా పనిచేసారు.

వీరు 1958 ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితిలు, జిల్లా పరిషత్తుల బిల్లు, 1958 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల గరిష్ఠ పరిమితి బిల్లు, 1958 ఆంధ్ర ప్రదేశ్ గ్రామ పంచాయతీల బిల్లు, 1962 ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల బిల్లు, 1962 ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీల బిల్లులపై ఏర్పాటు చేసిన సంయుక్త విశిష్ట సమితి సభ్యులుగా పనిచేసారు.

వీరు 1961-62, 1962-63 సంవత్సరాల మధ్యకాలంలో ప్రభుత్వ హామీల సమితి అధ్యక్షులుగా, 1961-62 సంవత్సరాల మధ్యకాలంలో అంచనాల సమితి సభ్యులుగా, మరియు తాత్కాలిక నియమావళి సమితి అధ్యక్షులుగా పనిచేసారు.

1978 వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వీరికి 'కళా ప్రపూర్ణ' బిరుదును, 1982 వ సంవత్సరంలో భారత ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదును ఇచ్చి సత్కరించారు.

శ్రీ బ్రహ్మయ్య కేవలం రాజకీయ వేత్త మాత్రమే కాదు, మంచి రచయిత, మరియు కళాపోషకులు. "కాలచక్రం, మన కర్తవ్యం, జాతి వెలుగులు, నా జీవన నౌక" అనే గ్రంథాలను రచించారు. కూచిపూడిలో సిద్ధాంత కళాక్షేత్రం నిర్మింపచేసి కూచిపూడి నాట్యానికి గుర్తింపు తేవడానికి ఎనలేని కృషిని చేసారు.

స్వాతంత్ర్య సమరయోధునిగా, గాంధేయవాదిగా, రైతు పెద్దగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సముపార్జించుకున్న శ్రీ బ్రహ్మయ్య 1984 వ సంవత్సరం జూలై 19 వ తేదీన మరణించారు.